క్లుప్తంగా

మల్లన్న సేవలో శ్రీశైల జగద్గురు పీఠాధిపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ డాక్టర్ చెన్నసిద్ధరామ శివాచార్య మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన పీఠాధిపతికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఈ డి.పెద్దిరాజు, అర్చకస్వాములు, ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు పీఠాధిపతికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతి మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబాదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్దగల ఆశీర్వచన మండపంలో పీఠాధిపతి గౌరవార్థం వస్త్ర సమర్పణ చేశారు. పీఠాధిపతి అనుగ్రహ బాషణ చేశారు.

అబ్బాస్‌నగర్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు: కల్లూరు శివారులోని అబ్బాస్ నగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బ్రహ్మయ్య ఆచారి షెడ్డులో కాపురముంటూ అందులోనే కిరాణ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఇంటికి తాళం వేసి బంధువుల ఊరికి వెళ్లాడు. మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారం మేరకు కర్నూలు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో కిరాణ వస్తువులతో పాటు ఇంటి వస్తువులు, బట్టలు మొత్తం కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ.2 లక్షల దాకా ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అధికారుల అంచనా.

శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సంజీవ నగర్, బైటిపేట కోదండరామాలయం, ఎస్బీఐ కాలనీ రామాలయం నూనెపల్లెలోని సీతారామాంజనేయ దేవాలయం, మూలసాగరంలోని కోదండ రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. రామాయణ పఠనం చేశారు. స్వామి వార్లకు ఉదయాన్నే పంచామృతాభిషేకాలు, పూలంగి సేవ, అర్చనలు, సింధూర అర్చనలు నిర్వహించి మహామంగళ హారతులు సమర్పించారు. సాయంత్రం సంజీవనగర్ రామాలయంలో స్వామి అమ్మవార్లకు వేదపండితులు పవన్ శర్మ, కార్తికేయ శర్మల ఆధ్వర్యంలో ఊంజల్ సేవ నిర్వహించారు.

నేడు శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవం

కోడుమూరు రూరల్ : వెంకటగిరిలో వెలసిన శ్రీగిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారి ప్రభోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా బుధవారం ఉదయం స్వామికి ప్రత్యేక పూజల అనంతరం గ్రామస్తులు ఉత్సవ విగ్రహాన్ని ప్రభపై గ్రామంలోని దస్తగిరయ్య కట్ట వరకు ఊరేగించి తిరిగి దేవాలయం వద్దకు చేరుస్తారు.

ద్విచక్రవాహనదారుడికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం డొంగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. బేతంచెర్ల గ్రామానికి చెందిన పరమేష్ ద్విచక్ర వాహనంపై నంద్యాలకు వెళ్తుండగా డొంగు వద్ద జాతీయ రహదారిపై యూటర్న్ చేసుకునే సమయంలో మరో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో పరమేష్ గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.



సుంకులా పరమేశ్వరి ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు



వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పార్టీ నాయకులు

గడపగడపలో ఉగాది ఉషస్సు

- నూతన తెలుగు సంవత్సరానికి ఘన స్వాగతం పలికిన భక్తులు
- అలరించిన కవి సమ్మేళనాలు, సాంస్కృతిక ప్రదర్శనలు
- పంచాంగ శ్రవణం చేసిన వేద పండితులు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవారి ఆలయాలు

కర్నూలు కల్చరల్: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకలు మంగళవారం నగరంలో అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు ఆలయాలను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. నూతన తెలుగు సంవత్సరానికి స్వాగతం పలికారు. గ్రామ దేవతలు సుంకులమ్మ, రేణుకా ఎల్లమ్మ, సవారమ్మ, మారెమ్మ, జంబులమ్మ, తదితర జగన్మాతలకు చీరెలు, సారెలు, నైవేద్యాలు సమర్పించారు. కోడి పుంజులు, పొట్టేళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేశారు. ఈ యేడాదిలో జరగబోయే దేశ కాలమానాల గురించి వివరించారు.

- తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల ఆలయంలో ఉగాది వేడుకలు జరిగాయి. వేద పండితులు శ్రీపాద నరేష్‌కుమార్ శర్మ పంచాంగ పఠనం చేశారు. ఆలయ చైర్‌పర్సన్ నగరూరు దీప్తి, కార్పొరేటర్ శ్రీనివాసరావు, ఈఓ దినేష్, హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.
- స్థానిక సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్పస్వామి ఆలయం ఆవరణలోని చౌడేశ్వరి మాత, అయ్యప్ప స్వామి, కైలాస నాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, పంచాంగ శ్రవణం తదితర కార్యక్రమాలు జరిగాయి.
- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితులు మామిళ్ల పల్లి రాజేష్ శర్మ పంచాగం పఠనం చేశారు. పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశ మిచ్చారు. కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. తెలుగు కాలమాన పట్టికను ఆవిష్కరించారు.
- ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీ జగన్నాథ స్వామి మందిరంలో శ్రీ గౌరనీతాయ్ అర్చామూర్తులకు మహా శంఖాభిషేకం, రాజభోగ నివేదన చేశారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన్ సేవక్ ప్రభు ఉపన్యసించారు.
- వీఆర్ కాలనీలోని చిన్మయ మిషన్‌లో కేంద్రం బాధ్యులు స్వామిని సుప్రేమానంద సరస్వతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచాంగ శ్రవణం చేశారు.
- శ్రీనివాసనగర్‌లోని సత్యసాయి మందిరంలో జరిగిన వేడుకల్లో పండితులు నరసింహ శాస్త్రి పంచాగ పఠనం చేశారు. సాయి భక్తులు, సాయి సేవకులు వేడుకల్లో పాల్గొన్నారు. సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్ పాల్గొన్నారు.



రాజ్‌విహార్ కూడలిలో రేణుకా ఎల్లమ్మ అలంకరణ



బిర్లాగడ్డలో సుంకులాపరమేశ్వరిని దర్శించుకుని నైవేద్యం సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు

- స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో సూర్యనారాయణస్వామి మూల విరాట్‌కు అరుణ పారాయణ పూర్వక జలాభిషేకం నిర్వహించారు. విశేషమైన అలంకారంతో భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.
- ప్రకాష్‌నగర్‌లోని సుంకులమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి పురవీధుల్లో ఊరేగించారు. న్యాయవాది శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- **పలువురు కళాకారులకు ఉగాది సత్కారాలు**
క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మంగళవారం స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో జరిగాయి. కృష్ణ బృందంచే నాదస్వర కచేరి జరిగింది. కొత్తపేట ఆంజనేయ స్వామి ఆలయం పండితులు భానుస్వామి పంచాంగ శ్రవణం చేశారు. ప్రముఖ కవులు డాక్టర్ వి.పోతన్న, ఇనాయతుల్లా, కల్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ చంద్రమౌళిని, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, మహమ్మద్ మియ్యాతో ఉగాది ప్రాశస్త్యంపై నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. నృత్య గురువులు కరీముల్లా, రోహిత్ బృందాలచే ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన గోపాల్, ఆర్జా రామకృష్ణ, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, కార్యక్రమ కన్వీనర్లు శ్రీనివాసరెడ్డి, సంగా ఆంజనేయులు, యాంగటీశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.
- **వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో..**
కర్నూలు (టౌన్) : ఈ ఏడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజకీయంగా కలిసి వస్తుంది. అలాగే కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌కు కూడా శుభాలు కలుగుతాయని పంచాంగ శ్రవణ పండితులు శ్రీ లక్ష్మీ నరసింహ శాస్త్రి వెల్లడించారు. మంగళవారం క్రోధి నామ ఉగాది పర్వదినం పురస్కరించుకొని స్థానిక నరసింగరావు పేటలోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నగర కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఉగాది శుభాకాంక్షలు అని, ఐదేళ్ల జగనన్న పాలనతో ప్రజలందరు సుభిక్షంగా ఉన్నారన్నారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి వైఎస్ జగన్ ఎంతో కృషి చేశారన్నారు. పార్టీలకు అతీతంగా మంచి చేసిన ఆయనను ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల సంపూర్ణ మద్దతతో అధికారంలోకి వస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈనెల 12 వ తేదీ నుంచి కర్నూలు నగర నియోజకవర్గ పరిధిలో ఇంటింటికి ఇంతియాజ్ పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికి జరిగిన మేలును వివరిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్. మద్దయ్య, కార్పొరేటర్ శ్రీనివాసరావు, షరీఫ్, శేఖర్, సత్యం యాదవ్, సుచరిత, నాగవేణి రెడ్డి పాల్గొన్నారు.
- **ఎమ్మెల్యే హాఫీజ్ ఇంట్లో ..**
ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్వగృహంలో మంగళవారం ఉగాది పర్వదిన వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీనాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే క్రోధి నామ సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు వేదపండితులు ఎమ్మెల్యేకు పంచాంగం శ్రవణం చదివి వినిపించారు. ఉగాది పచ్చడి ఆస్వాదించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సత్యసాయి మందిరంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు



ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌కు పంచాంగ శ్రవణం వినిపిస్తున్న వేద పండితులు



రాంబొట్ల ఆలయంలో పంచాంగ పఠనం ..

14న జై భీమ్ ర్యాలీ

కర్నూలు(అర్బన్): ఈ నెల 14వ తేదీన డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న జై భీమ్ ర్యాలీని విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ నేతలు కోరారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ర్యాలీకి సంబంధించిన కరపత్రాలను జేఏసీ నేతలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మూలింటి మారెప్ప, జేఏసీ అధ్యక్షుడు సోమసుందరం మాదిగ, ప్రధాన కార్యదర్శి అనంత రత్నంమాదిగ, ఐఎస్‌టీయూసీ నాయకులు బతుకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలులో డా.బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాన్ని రథంపై పెట్టుకొని జైభీమ్ ర్యాలీని ఘనంగా నిర్వహించనున్నామని పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ మాదిగ, కిరణ్‌మాదిగ, లాజరస్‌మాదిగ, రాజుమాదిగ, గిడ్డన్న మాదిగ, శివప్రసాద్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాదిగ జేఏసీ నేతలు

వైఎస్సార్‌సీపీలో బీసీలకు ప్రాధాన్యం

- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్) : వెనుకబడిన కులాలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయంగా ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. విద్యాధికురాలు, న్యాయవాది, కురువ సామాజిక వర్గానికి చెందిన మహిళ సిట్రా సత్యనారాయణమ్మకు జిల్లా అధ్యక్ష పదవి కేటాయించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం సత్యనారాయణమ్మను దేవనగర్‌లోని ఆమె స్వగృహంలో కలిసి అభినందించి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో మహిళలకు సముచిత స్థానం ఉందనడానికి సిట్రా సత్యనారాయణమ్మ నియామకమే ఉదాహరణ అన్నారు. ఈమె నాయకత్వంలో కర్నూలు పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. జిల్లాలో విస్తృతంగా పర్యటించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను ఏకం చేసి వైఎస్‌ఆర్‌సీపీ జెండాను ఎగురవేస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.



సత్యనారాయణమ్మను సత్కరిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

బీజేపీ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ముగ్గురు రాష్ట్ర బాధ్యులతో జిల్లా కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కూటమిలో భాగంగా ఆదోని నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ బీజేపీ కేటాయిస్తున్నారని ఆ సీటు నుంచి తాము తప్పుకుంటే రూ.3 కోట్లు ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ సోదరుడు టీడీపీ నాయకులతో మాట్లాడిన ఆడియో వైరల్ అయింది. ఈ విషయాన్ని బీజేపీ అధిష్టానం సీరియస్‌గా పరిగణించింది. బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మధుకర్‌జీ నేతృత్వంలో సోమవారం ఆదోనిలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం వాడివేడీగా జరిగింది. ఆదోని అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి వాల్మీకిని మార్చాలని మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోనికి చెందిన కొందరు ముఖ్య నాయకులు పట్టుపట్టినట్లు తెలిసింది. ఆయన స్థానంలో ఎమ్మిగనూరు ఇన్‌చార్జ్ మురారెడ్డికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. ఆదోని అసెంబ్లీ ఎన్నికల నిర్వహణతో పాటు, జిల్లా పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సావిత్రి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు విట్టా రమేష్‌లతో కూడిన కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగరూరు రాఘవేంద్రను టూర్ కమిటీ కన్వీనర్‌గా నియమించారని తెలిసింది. దీంతో బీజేపీ జిల్లా ప్రస్తుత అధ్యక్షుడు కునిగిరి నీలకంఠకు ప్రాధాన్యత తగ్గించారని ఆపార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు.

మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలి

కర్నూలు (టౌన్): ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకొని మహిళలు పారిశ్రామిక వేత్తలుగా రాణించాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ సతీమణి సమీనా పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక బుధవార పేటలోని మెరిడియన్ ఫంక్షన్ హాలులో బిజ్ మేళా నిర్వహించారు. మహిళలు తయారు చేసిన అన్ని రకాల ఉత్పత్తులను అక్కడ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరికి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అయితే, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో ఎంతో వృద్ధి సాధించారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా నైపుణ్యాలు మెరుగుపరుచుకుని రాణించవచ్చన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఎస్వీ విజయమనోహరి మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా పొదుపు గ్రూపులను బలోపేతం చేసే దిశగా కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ గాజుల శ్వేతారెడ్డి మాట్లాడుతూ జగనన్న ప్రవేశ పెట్టిన వైఎస్సార్ చేయూత ద్వారా ఎంతో మంది మహిళలు స్వయం ఉపాధిలో రాణిస్తున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ సతీమణి సమీనా

45వ వార్డులో ఇఫ్తార్ విందు

కర్నూలు (టౌన్) : పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం నగరపాలక సంస్థ పరిధిలోని 45 వ వార్డు కప్పల్ నగర్‌లోని అజుముద్దీన్ మసీదులో ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు , కార్యకర్తలు పాల్గొని ప్రత్యేక దువా చేశారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై.రామయ్య, ఇంతియాజ్, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి

కఠిన రోగాలకు తీపి వైద్యం!

- జిల్లాలో హోమియోకు ఆదరణ
- గతంతో పోలిస్తే పెరిగిన రోగులు
- జిల్లాలో 19 ప్రభుత్వ హోమియో డిస్పెన్సరీలు
- అన్ని చోట్ల ఉచితంగా చికిత్స, మందులు
- దీర్ఘకాలిక జబ్బులకు, మొండి రోగాలకు చక్కటి వైద్యం
- నేడు వరల్డ్ హోమియోపతి డే



కర్నూలు(హాస్పిటల్): చాలా మంది జబ్బు చేసినప్పుడు మందులు వేసుకోవాలంటే ఇబ్బంది పడుతుంటారు. కొన్ని రకాల మందులు, సిరప్‌లు చేదుగా ఉంటాయని తిరస్కరిస్తుంటారు. కానీ ఏ వ్యాధికైనా తియ్యని గుళికలతో నాలుకకు, మనసుకు ఇబ్బంది లేకుండా మందును అందించే ఏకైక వైద్య విధానం హోమియోపతి. ఈ వైద్యులు ఇచ్చే మందులు నోట్లో వేసుకోగానే కమ్మగా కరిగిపోతాయి. జర్మని దేశానికి చెందిన డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యుల్ హనీమన్ మొదటిసారిగా హోమియో విధానాన్ని కనుగొన్నారు. ఆయన 1755 సంవత్సరం ఏప్రిల్ 10న జన్మించారు. అందుకే ప్రతి ఏటా ఏప్రిల్ 10వ తేదీన హోమియో డేగా పిలుస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

హోమియోపతి ప్రాముఖ్యత

ప్రపంచ హోమియోపతి దినోత్సవం ఒక ముఖ్యమైన కార్యక్రమం. ఎందుకంటే ఇది ప్రత్యామ్నాయ వైద్యం గురించి అవగాహన పెంచుతుంది. ఏప్రిల్ 10న డాక్టర్ శామ్యూల్ హనీమన్ పుట్టినరోజును పురస్కరించుకుని హోమియోపతి గురించి అవగాహన కల్పించేందుకు చాలా మంది ప్రజలు ఒకచోట చేరతారు. హోమియోపతి గురించి అవగాహన పెంచుకోవడానికి ఇది ఒక మంచి అవకాశం. సంపూర్ణ, రోగి-కేంద్రీకృత ఆరోగ్య సంరక్షణ యొక్క ప్రాముఖ్యతను గుర్తించేందుకు ఇది ఒక అవకాశం. హోమియోపతి దీర్ఘకాలిక నొప్పి, అలర్జీలు, జీర్ణ రుగ్మతలతో సహా అనేక విభిన్న పరిస్థితులకు చికిత్స చేయడంలో ప్రభావవంతంగా ఉన్నట్లు నిరూపించారు. సంప్రదాయ వైద్యానికి బాగా స్పందించని దీర్ఘకాలిక పరిస్థితుల చికిత్సకు ఇది ప్రత్యేకంగా సరిపోతుంది. హోమియోపతి కూడా సురక్షితమైనది, సున్నితమైనది. కొన్ని దుష్ప్రభావాలతో, కఠిన మందులను నివారించాలనుకునే వ్యక్తులకు ఇది ఒక ప్రసిద్ధఎంపిక.

జిల్లాలో హోమియోపతి ప్రస్తానం

జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో రెగ్యులర్, ఎన్‌హెచ్ఎం కలిపి మొత్తం 19 హోమియో డిస్పెన్సరీలు ఉన్నాయి. రెగ్యులర్‌గా పత్తికొండ, పోలకల్, కర్నూలు, వెల్దుర్తి, నంద్యాల, జిల్లెల్ల, డి. బెళగల్, చనుగొండ్ల, క్రిష్ణగిరి, ఆత్మకూరు, పగిడ్యాల, నేషనల్ హెల్త్ మిషన్‌లో చాపిరేవుల, పెద్ద ఎమ్మనూరు, డోన్, ఉలిందకొండ, పెద్ద తుంబళం, సున్నిపెంట, ప్యాపిలి డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా డిస్పెన్సరీలకు ప్రతిరోజూ 35 నుంచి 50 మంది వరకు కొత్తగా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలు, నంద్యాల, డోన్‌లాంటి చోట్ల ఓపీ రోగుల సంఖ్య దీనికి రెట్టింపుగా ఉంటోంది. అన్ని డిస్పెన్సరీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు తెరిచే ఉంటాయి. ఇక్కడ చికిత్స, మందులు పూర్తిగా ఉచితం. దీంతో పాటు కర్నూలు నగరంలో పలు కార్పొరేట్ సంస్థలు అడుగుపెట్టడంతో హోమియో వైద్యవిదానానికి మరింత క్రేజ్ ఏర్పడింది. నగరంలో 12 నుంచి 16 దాకా కార్పొరేట్ సంస్థల ఆసుపత్రులు ఉండగా, స్థానిక వైద్యులు జిల్లా మొత్తంగా 650 నుంచి 700 మంది దాకా చికిత్స అందిస్తున్నారు. మొత్తంగా సగటున ఏడాదికి 6 లక్షల మంది దాకా హోమియో వైద్యాన్ని అందుకుంటున్నారు.

మొండి రోగాలకు చక్కని పరిష్కారం !

హోమియో వైద్య విధానంలో మొండి రోగాలకు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆదరణ పెరుగుతోంది. ఇతర వైద్య విధానాల్లో నయం కాని వారు హోమియోకు వచ్చి చికిత్స తీసుకుని వ్యాధిని నయం చేసుకుని వెళ్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానంగా నడుంనొప్పులు, ఆర్థరైటిస్, చర్మవ్యాధులు, తరచూ వచ్చే చీముగడ్డలు, గజ్జి, తామర, ఎగ్జిమా, చెవిలో చీము కారడం, ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, స్టాన్సిలైటిస్, నాజిల్ పాలిప్స్, గ్యాస్ట్రబుల్, మలబద్ధకం, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, పసిరికలు, అమీబియాసిస్, నరాల సంబంధిత వ్యాధులు (సయాటిక, సర్వికల్ స్పాండిలోసిస్, లాంబార్ స్పాండిలైసిస్), కిడ్నీలో రాళ్లు, పలు రకాల అలర్జీలు, మైగ్రేన్లు, డిప్రెషన్, క్రానిక్ ఫెటిగ్ సింట్రోమ్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ప్రకోప ప్రేగు సిండ్రోమ్, ప్రీమెన్స్ట్రసల్ సిండ్రోమ్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు హోమియో మందులు బాగా ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు పేర్కొంటున్నారు.

డిస్పెన్సరీల్లో ఉచితంగా చికిత్స



జిల్లాలో హోమియోపతి వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ హోమియో డిస్పెన్సరిలలో రోగుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతోంది. నేషనల్ ఆయుష్ మిషన్ ద్వారా హోమియో వైద్యానికి గత సంవత్సరంతో పోలిస్తే మందులు బాగా పెరిగాయి. హోమియో డిస్పెన్సరీల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స, మందులు అందిస్తున్నాము. వరల్డ్ హోమియో డేను పురస్కరించుకుని అన్ని డిస్పెన్సరీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాము. **–డాక్టర్ టి.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఆయుష్ అధికారి, కర్నూలు**

హోమియోపతిలో అద్భుత ఫలితాలు



హోమియోపతి మందుల ద్వారా అన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులను శాశ్వతంగా నయం చేయవచ్చు. ఈ మందుల వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ ఉండవు. ఎలాంటి నొప్పి, ఆపరేషన్ లేకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించవచ్చు. ప్రధానంగా థైరాయిడ్, పీసీవోడి, షుగర్, బీపీ, సొరియాసిస్, వెన్నునొప్పి, కీళ్లనొప్పులు, ఆర్థరైటిస్, మానసిక సమస్యలు తదితర ఆరోగ్య సమస్యలను హోమియో ద్వారా శాశ్వతంగా నివారించవచ్చు. ముందుగా రోగి మానసిక, శారీరక లక్షణాలు పరిగణనలోకి తీసుకుని కౌన్సిలింగ్ అందిస్తాము. ఆ తర్వాత వ్యాధి మూలకారణాలను గుర్తించి రోగికి మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తాము. **–డాక్టర్ విద్యాసాగర్‌రావు, ప్రభుత్వ హోమియోవైద్యులు, కర్నూలు**